
కొత్తగూడ : ఎంచగూడెంలో వృద్ధురాలికి నమస్కరిస్తున్న ములుగు బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి


బయ్యారం కొత్తపేట గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం


రాయపర్తి : మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన పలు పార్టీల కార్యకర్తలు


బయ్యారం : కారు గుర్తుకు ఓటు వేయాలని వృద్ధురాలిని అభ్యర్థిస్తున్న ఇల్లెందు అభ్యర్థి హరిప్రియానాయక్

# కారు జోరు..

## ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ దూకుడు



- ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థులు
- ప్రచారంలో దూసుకెళ్తున్న గులాబీ శ్రేణులు
- 'మ్యానిఫెస్టో'ను స్వాగతిస్తూ మద్దతు తెలుపుతున్న సబ్బండ వర్గాలు
- రేపు వర్ధన్నపేట, మానుకోటలో ప్రజా ఆశీర్వాద సభలు
- హాజరుకానున్న అధినేత కేసీఆర్

వరంగల్, అక్టోబర్ 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రచారంలో భారత రాష్ట్ర సమితి ముందువరుసలో ఉన్నది. ప్రత్యర్థి పార్టీలతో పోల్చితే గులాబీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకు పోతున్నారు. ముఖ్యనేతల పర్యటనలతో ప్రచారం ఊపందుకుంది. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ మరో కీలక నేత హరీశ్‌రావు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దాదాపు అన్ని సెగ్మెంట్లను చుట్టి వచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ప్రచారానికి శ్రీకారం చుట్టిన బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఈ నెల 16న జనగామ నియోజకవర్గ ఆశీర్వాదసభలో పాల్గొన్నారు. దసరా పర్వదినం ముగియడంతో తాజాగా రాష్ట్రవ్యాప్త ప్రచారంలో భాగంగా మరోసారి ఉమ్మడి జిల్లాకు రాబోతు న్నారు. ఈ నెల 27న ఒకేరోజు వర్ధన్నపేట, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననున్నారు. ఈమేరకు ఆయాచోట్ల నిర్వహించే బహిరంగ సభల కోసం మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్‌తో పాటు ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, బానోత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. భారీగా జనసమీకరణ చేసి సభ లను విజయవంతం చేసేందుకు కృషిచేస్తున్నారు. సీఎం కేసీఆర్ త్వరలో మిగితా నియోజకవర్గా ల్లోనూ ప్రచారం నిర్వహించేలా ప్రణాళిక సిద్ధమవుతున్నది.

### ప్రతిపక్షాల కంటే ముందుగా ప్రచారంలోకి..

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా ఉన్న తెలంగాణ రాష్ట్ర నమూనాతో బీఆర్ఎస్ ఎన్నికలకు సిద్ధమైంది. ప్రత్యర్థి పార్టీల కంటే చాలా ముందుగా బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించింది. టిక్కెట్లు ఖరారైన రోజు నుంచే బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టారు. అన్ని సెగ్మెంట్లలో అభ్యర్థులు ఇప్పటికే ఒక దశ ప్రచారం పూర్తి చేశారు. నియోజకవర్గ స్థాయిలో సన్నాహక సమావేశాలు, ఆ తర్వాత మండల స్థాయి సమావే శాలు పూర్తయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఊర్ల వారీగా.. నగరాల్లో డివిజన్ల వారీగా, పట్టణాల్లో వార్డుల వారీగా బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారం పూర్తి చేశారు. కొన్ని సెగ్మెంట్లలో గ్రామాల్లో ఇంటింటికీ ప్రచారం సైతం పూర్తవుతున్నది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటం, సొంత రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి ప్రధాన ఎజెండగా బీఆర్ఎస్ ప్రచారం సాగుతున్నది.

### మ్యానిఫెస్టోతో ప్రజల వద్దకు..

బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లుగా చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ఈ నెల 15న ప్రకటించిన మ్యానిఫెస్టో ఎన్నికల ప్రచారంలో కీలకమవుతున్నది. అన్ని వర్గాలు బీఆర్ఎస్ మ్యానిఫె స్టోను ఆదరిస్తుండగా ముఖ్యంగా మహిళలు పూర్తి స్థాయిలో స్వాగతిస్తు న్నారు. అర్హులైన మహిళలకు ప్రతి నెల రూ.3 వేల చొప్పున భృతి ఇవ్వను న్నట్లు ప్రకటించింది. పేద మహిళలకు రూ.400కు గ్యాస్ సిలిండర్ సర ఫరా చేయనున్నట్లు ప్రకటించింది. మహిళా సమాఖ్యలకు సొంత భవ నాలు నిర్మించనున్నట్లు పేర్కొన్నది. అలాగే రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తామని ప్రకటించడంపై పేద వర్గాలు సంతృప్తి వ్యక్తం చేస్తు న్నారు. తెల్లకార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా అమలు చేస్తామని ప్రకటించింది. బీమాకు అవసరమైన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించనున్నది. ప్రతి పేద కుటుంబానికి బీమా కల్పించే ఆలోచన గొప్పదని ఈ వర్గాల వారు చెబుతున్నారు. ఉచిత వైద్య ప్రక్రి యలో భాగంగా ఆరోగ్యశ్రీ కింద వైద్యం కోసం అందించే మొత్తాన్ని ఇప్పుడున్న రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచనున్నట్లు బీఆర్ ఎస్ మేనిఫెస్టోలో ప్రకటించింది. ఆసరా పెన్షన్ల మొత్తాన్ని ప్రస్తుతం ఉన్న రూ.2016 నుంచి మొదటి ఏడాదిలో రూ.3016కు... ఆ తర్వాత ఏటా రూ.500 చొప్పున మొత్తంగా రూ.5వేలకు, దివ్యాంగుల పెన్షను ఇదే పద్ధతిలో రూ.6016 వరకు పెంచ నున్నట్లు మేనిఫెస్టోలో ప్రకటించడాన్ని సబ్బండ వర్గాలు స్వాగతిస్తున్నాయి. రైతుబంధు పథకం కింద ప్రస్తుతం ఉన్న ఎకరానికి రూ.10 వేలను.. మొదటి ఏడాది రూ.12 వేలకు, ఆ తర్వాత క్రమంగా రూ.15 వేలకు పెంచను న్నట్లు మ్యానిఫెస్టోలో బీఆర్ఎస్ ప్రకటించింది. వడ్ల కొను గోలు ప్రక్రియను యథావిధిగా కొనసాగించనున్నట్లు బీఆ ర్ఎస్ ప్రకటించింది. ప్రస్తుతం అమలవుతున్న హౌసింగ్ విధానాన్ని కొనసాగించనున్నట్లు బీఆర్ఎస్ పేర్కొన్నది. అగ్ర వర్ణాల్లోని పేద పిల్లల చదువుల కోసం ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున గురుకులాన్ని ప్రారంభించనున్నట్లు మ్యానిఫెస్టోలో ప్రకటించారు. అనాథ పిల్లల సంక్షేమం కోసం ప్రత్యేక విధానాన్ని అమలు చేయనున్నట్లు బీఆర్ఎస్ హామీ ఇచ్చింది. ఉద్యోగుల సీపీఎస్‌పై అధ్యయన కమిటీని నియమించనున్నట్లు ప్రకటించింది. అసైన్ ల్యాండ్ హక్కులపై ప్రత్యేక విధానాన్ని అమలు చేయనున్నట్ల హామీ ఇచ్చింది. మైనా ర్టీల సంక్షేమాన్ని మరింత విస్తృతం చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు బీఆర్ ఎస్ పేర్కొన్నది. అన్ని వర్గాల సమగ్ర అభ్యున్నతి లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రకటిం చిన మ్యానిఫెస్టోతో గులాబీ పార్టీ ప్రచారం జోరుగా సాగుతున్నది.


ఐనవోలు : కక్కిరాలపల్లిలో బీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేశ్, చిత్రంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

## హ్యాట్రిక్ విజయమే లక్ష్యంగా..

ఉమ్మడి జిల్లాలో బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారం జోరుగా సాగింది. పాలకుర్తి నియోజకవర్గంలోని పాలకుర్తి, తొర్రూరు, రాయపర్తి మండల్లాలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విస్తృతంగా పర్యటించారు. ఆయాచోట్ల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమా వేశమై 'బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయమే' లక్ష్యంగా పనిచేయాలంటూ దిశానిర్దేశం చేశారు. బయ్యారంలో మహబూబాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందుతో కలిసి ఇల్లందు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్ ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సంద ర్భంగా కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీలో పాల్గొని ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. కొత్తగూడ మండలకేంద్రంలో లంబాడీల ఆత్మీయ సమ్మేళనంలో ములుగు నియోజకవర్గ అభ్యర్థి బడే నాగజ్యోతి పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ చొరవతోనే తాను సర్పంచ్ నుంచి ఇవాళ ఎమ్మె ల్యేగా పోటీచేసే స్థాయికి వచ్చానని.. మీ ఆడబిడ్డగా ఆశీర్వదించాలని కోరారు. భూపాలపల్లి మున్సిపాలిటీలోని 20, 22వ వార్డులో ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. మరిపెడలో స్థానిక యువకులతో డోర్నకల్ ఎమ్మెల్యే అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్ సమావేశమై మరోమారు తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తిచేశారు. ఐనవోలు మండలం కక్కిరాలపల్లిలో వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ పర్యటించగా ఆయన గెలుపులో భాగం అవుతామంటూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి 100మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. నర్సంపేట, చెన్నారావుపేట, నల్లబెల్లి, దుగ్గొండిలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరగా పెద్ది గెలుపు కోసం యువత ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. వరంగల్‌లో తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నన్నపునేని నరేందర్ సమక్షంలో 32,34,36 డివిజన్ల కాంగ్రెస్ నాయకులు, నేతలు బీఆర్ఎస్‌లో చేరారు.


నెల్లికుదురు : మండలకేంద్రంలో ముఖ్యకార్యకర్తలలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్, బీఆర్ఎస్ మానుకోట జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత


మంథని : కమాన్‌పూర్‌లోని కేఎన్ ఫంక్షన్ హాల్‌లో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న పుట్ట మధూకర్, ఈద శంకర్‌రెడ్డి


జమ్మికుంట సమావేశంలో మాట్లాడుతున్న మండలి విప్, బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి


నర్సంపేట : బీఆర్ఎస్‌లో చేరిన పట్టణంలోని ఒకటో వార్డు కాంగ్రెస్ కార్యకర్తలతో నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి


కృష్ణకాలనీ : భూపాలపల్లి మున్సిపల్ పరిధి 20, 22 వార్డుల బీఆర్ఎస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి


మరిపెడ : బీఆర్ఎస్‌లో చేరిన యువతతో డోర్నకల్ ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్యానాయక్


నర్సింహులపేట : గోపతండాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు యాదగిరిరెడ్డి, నాయకులు